

ఉమామహేశ్వరి కాలనీలో పర్యటిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

ఉమామహేశ్వరి కాలనీలో
ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు
● ఎంపీ ఈటల రాజేందర్

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి ఉమామహేశ్వరి కాలనీలో ముంపు ప్రాంతాల్లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆదివారం పర్యటించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అధికారులకు ఫోన్ చేసి ముంపు సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, సతీష్‌సాగర్, శివాజీరాజా, సరితారావు, రాజశేఖర్, మాధురి, అశోక్ పాల్గొన్నారు.



నవోదయ కాలనీలో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

కాలనీల్లో రోడ్ల నిర్మాణానికి చర్యలు

హైదర్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాలనీలో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆల్విన్ కాలనీ డివిజన్ నోవదయ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ వెంట బీవీ రమణ, రాజిరెడ్డి, బాలస్వామి, శివశంకర్ తదితరులు ఉన్నారు.

'ప్రభుత్వ భూములను కాపాడండి'

హైదర్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను కాపాడాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గ్రేటర్ హైదరాబాద్‌లో చెరువులను సర్వే చేయించి అక్రమ నిర్మాణాలను తొలగించాలన్నారు. అక్రమ నిర్మాణాలకు అనుమతి ఇచ్చిన అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కబ్జా అయిన ప్రభుత్వ భూములను కాపాడినప్పుడే హైడ్రాపై నమ్మకం పెరుగుతుందన్నారు.



కుటుంబ సభ్యులతో కలిసి హోమంలో బండి రమేష్

హేమదుర్గామాత ఆలయంలో బండి రమేష్ పూజలు

బాలానగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ ఆల్విన్ చౌరస్తా సమీపంలోగల హేమ దుర్గామాత ఆలయ 24వ వార్షికోత్సవం సందర్భంగా కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విజయ గణపతి ఆలయ వేడుకలు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ కాలనీ తొమ్మిదో ఫేజ్‌లోగల విజయ గణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఈనెల 27 నుంచి 29 వరకు నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటి రోజు గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. 28వ తేదీ ఉదయం పూజల అనంతరం స్వామివార్ల కల్యాణ మహోత్సవం, సాయంత్రం 5 గంటలకు రథోత్సవం, 29వ తేదీ ఉదయం 8 గంటల నుంచి పూజలు, వసంతోత్సవం, 11 గంటల నుంచి అన్న సమారాధన ఉంటుందని కమిటీ నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం ఉంటుందన్నారు.

చెరువుల ఆక్రమణ.. హైడ్రా కమిషనర్ దృష్టికి

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను మూసాపేట్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ ఓబీసీ వర్కింగ్ చైర్మన్ తూము వినయ్‌కుమార్ ఆదివారం కలిశారు. శాలువాతో సత్కరించి పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో చెరువుల ఆక్రమణపై వినతిపత్రం అందజేశారు. చెరువులను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



హైడ్రా కమిషనర్‌కు మొక్క అందజేస్తున్న వినయ్‌కుమార్

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకొని, వైద్యుల సహాలు తీసుకోవాలని సూచించారు.

మోతీనగర్ గౌడ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్

అల్లాపూర్, 25 ఆగస్టు (ఆంధ్రజ్యోతి): మోతీనగర్ గౌడ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. కబీర్‌నగర్ నల్ల పోచమ్మ దేవాలయ ఆవరణలో జరిగిన సభ్యుల సమావేశంలో అధ్యక్షుడిగా గంటా శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. పూర్తిస్థాయి కార్యవర్గాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. గౌడ సామాజిక వర్గం సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బి.సత్యనారాయణ గౌడ్, లాలయ్యగౌడ్, సంజీవగౌడ్, కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, వంగ బాలరాజ్, విక్కి, నవీన్, పవన్, హనుమంతరావు, రాంబాబు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్‌ను సత్కరించిన కమిటీ సభ్యులు

గాజులరామారంలో
అంతర్గత రోడ్లు అధ్వానం

గాజులరామారం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చినుకు పడిందంటే కాలనీల వాసుల్లో వణుకు మొదలవుతోంది. గాజులరామారం డివిజన్ బాలయ్యనగర్, కైసర్‌నగర్, మహదేవపురం, కైలాస్‌హిల్స్‌లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. వర్షపు నీటిలో మురుగునీరు కలిసి రోడ్లపై ప్రవహిస్తుండడంతో దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరిస్తామని నాయకులు, అధికారులు హామీ ఇస్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదన్నారు. రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాలయ్యనగర్, కైసర్‌నగర్‌లో రోడ్ల దుస్థితి





మెరిట్ విద్యార్థులకు బహుమతులు

హైదర్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆలివ్ మిఠాయి సంస్థ అధినేత దొరరాజు నగదు బహుమతులు అందజేయడం అభినందనీయమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన 14 పాఠశాలలకు చెందిన విద్యార్థులను ఆదివారం సన్మానించి, నగదు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు దొరరాజును అభినందించారు. దొరరాజు మాట్లాడుతూ.. పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు పదో తరగతిలో పదో గ్రేడ్ సాధించిన వారికి లక్ష రూపాయలు ఇస్తామని గతంలో చెప్పామని, ఈ సంప్రదాయం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో హరీష్‌చంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఆలివ్ మిఠాయి అధినేత దొరరాజు



తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఘనంగా తీజ్ వేడుకలు

మియాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నడిగడ్డ తండాలో ఆదివారం తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. గిరిజనులు ఆనందంగా జరుపుకునే పండుగ తీజ్ అని అన్నారు. ఈ సందర్భంగా గిరిజనులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి కృషిచేస్తున్నారని, భారత సంస్కృతి, సంప్రదాయాలను కాపాడిన మహనీయుడు సేవాలాల్ మహరాజ్ అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మోహన్ ముదిరాజ్, గంగాధర్, తండా వాసులు స్వామి, లకపతి, తిరుపతి, శంకర్ నాయక్‌లు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే చెత్త డంపింగ్

గచ్చిబౌలి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ డివిజన్ మార్తాండ్‌నగర్, రాఘవేంద్రకాలనీలోకి వెళ్లే దారిలో చెత్త డంపింగ్ చేస్తున్నారు. దుర్వాసనతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయని, రోగాల బారిన పడుతున్నామంటున్నారు. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటున్నారు. చెత్తను తరలించకపోతే శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.



రాఘవేంద్రకాలనీ రోడ్డు పక్కన చెత్త

ఏడాదిగా.. రహదారి పక్కనే గణేశ్ విగ్రహాలు
● తొలగించని విక్రయదారులు ● పట్టించుకోని అధికారులు



ఏడాదిగా ఎర్రగడ్డలో జాతీయ రహదారి పక్కన ఉన్న వినాయక విగ్రహాలు

ఎర్రగడ్డ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ గోకుల్ థియేటర్, మూసాపేట నుంచి ఈఎస్ఐ ఆస్పత్రి వరకు వెళ్లే రహదారిలో ఫుట్‌పాత్‌పై ప్రతి ఏడాది వినాయక చవితికి సుమారు 15, 20 అడుగుల విగ్రహాలను విక్రయిస్తుంటారు. గతేడాది కొన్ని విగ్రహాలు మిగిలిపోయాయి. విక్రయదారులు ఎర్రగడ్డ రైతుబజార్ ఎదుట, సెయింట్ థెరిసా ఆస్పత్రి వద్ద, హీరోహోండా షోరూం వద్ద విగ్రహాలను అలాగే వదిలేశారు. విగ్రహాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను పలువురు కోరుతున్నారు.

సమాచారం ఇచ్చినా స్పందించడం లేదు

విగ్రహాలను తొలగించాలని గత ఏడాది విక్రయదారులకు సమాచారం ఇచ్చినా స్పందించ లేదు. పలుమార్లు ఫోన్ చేస్తున్నా పట్టించుకోవడం లేదు. కొత్త విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

- రాజాసింగ్, ఫతేనగర్

దొంగతనానికి ప్రయత్నిస్తూ వ్యక్తి మృతి

యూసుఫ్‌గూడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దొంగతనం చేసేందుకు ప్రయత్నిస్తున్న ఓ వ్యక్తి ప్రమాదశాత్తు మృతి చెందాడు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ మెట్రో స్టేషన్ సమీపంలో ఆగ్రా స్వీట్స్ ఎదుట గల ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో చోరీ చేసేందుకు ఆదివారం తెల్లవారు జామున ఓ వ్యక్తి ప్రయత్నించాడు. డబ్బాకు ఉన్న ఒక సైడ్ మూత తీశాడు. మరో వైపు మూత తీసేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు డబ్బా అతడిపై పడడంతో ఊపిరి ఆడక మృతి చెందాడు. ఉదయం 6 గంటలకు గమనించిన పోలీసులు డబ్బా తీసి చూడగా వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతుడి వివరాలు తెలియరాలేదు. పండ్ల వ్యాపారిని కొట్టి చంపారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. అసత్యాలను ప్రచారం చేసి ప్రజల్లో భయాందోళనలను రేకెత్తించడం తగదన్నారు.

వృద్ధుడి అదృశ్యం



సర్దార్ దీప్‌సింగ్

అమీర్‌పేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధి అమీర్‌పేట డివిజన్ కుమ్మరిబస్తీకి చెందిన సర్దార్ దీప్‌సింగ్(65) ఈనెల 20వ తేదీ ఉదయం 7 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో కుమారుడు సుమిత్‌సింగ్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేటర్‌కు సన్మానం

గచ్చిబౌలి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించినందుకు కార్పొరేటర్ హమీద్ పటేల్‌ను కొండాపూర్ డివిజన్ పార్కు అవెన్యూ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం సన్మానించారు.



కార్పొరేటర్ హమీద్‌పటేల్‌ను సన్మానిస్తున్న పార్కు అవెన్యూ కాలనీ వాసులు

శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ఆహ్వానం



శ్రీకృష్ణాష్టమి వేడుకలకు జగదీశ్వర్‌గౌడ్‌ను ఆహ్వానిస్తున్న ఇస్కాన్ సభ్యులు

హైదర్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలకు కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌ను ఇస్కాన్ సభ్యులు ఆదివారం కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, కృష్ణముదిరాజ్, ఏకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



గాజులరామారం నల్లపోచమ్మ రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి తదితరులు.

- నిజాంపేట, ఆంధ్రజ్యోతి

ఉద్యోగం, రుణం ఇప్పిస్తానని మోసం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం, లోన్లు ఇప్పిస్తానని పలువురిని మోసం చేశాడు ఓ వ్యక్తి. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడ ప్రాంతానికి చెందిన జి. నర్సింగరావు ఐటీలో పనిచేసి రిటైర్ అయ్యారు. అతడికి మార్చిలో ఎం. ఉమామధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. మీ ఇంటికి వాస్తు దోషం ఉందని, అందుకే ఆర్థిక ఇబ్బందులు వస్తున్నాయని, రూ. 30 లక్షల రుణం ఇప్పిస్తానని నమ్మించాడు. ఇందుకు రూ. 2 లక్షలు ఖర్చవుతుందని ఉమా మధుసూదన్‌రెడ్డి చెప్పగా.. నర్సింగరావు నమ్మి జూన్‌లో అతడికి రూ. 2 లక్షలు ఇచ్చాడు. నెల రోజుల్లో లోను ప్పిస్తానని చెప్పి తప్పించుకు తిరుగుతున్నాడు. బాధితుడు అతడి ఇంటికి వెళ్లగా సుమాంజలి, సంతోష్, రాకేష్ మాయమాటలు చెప్పి పంపిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఎల్లారెడ్డిగూడలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ఎస్. రాంబాబు అనే వ్యక్తి కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని మధుసూదన్‌రెడ్డి రూ. 3 లక్షలు, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పిస్తానని లక్ష రూపాయలు తీసుకున్నాడు. రాంబాబు డబ్బులు తిరిగి ఇవ్వమని అడగగా తప్పించుకు తిరుగుతున్నాడు. గట్టిగా అడగటంతో చెక్కులు ఇచ్చాడు. వాటిని బ్యాంకులో వేయగా బౌన్స్ అయ్యాయి. బాధితులు అతడి ఇంటికి వెళ్లగా తాళం వేసి ఉండడంతో మోస పోయామని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అక్రమ నిర్మాణాలు..
అదనపు అంతస్తులు
● నివాసిత ప్రాంతాల్లో భారీగా కమర్షియల్ భవనాలు ● కూల్చేయాలని హైకోర్టు ఆదేశించినా పట్టించుకోని జీహెచ్ఎంసీ



వెంగళరావునగర్ ప్రభుత్వ పాఠశాల వెనక వీధిలో అక్రమ నిర్మాణం

అనుమతి మూడంతస్తులు.. కట్టేది ఆరు..

మధురానగర్, వెంగళరావునగర్‌లో ప్రధాన రహదారులు తప్పితే మిగతావన్నీ కూడా నివాసిత ప్రాంతాలే. ఇక్కడ 300 నుంచి 200 గజాల వరకు ప్లాట్లు ఉన్నాయి. ఈ స్థలం కొలమానం ప్రకారం జీహెచ్ఎంసీ అనుమతితో జీ ప్లస్ టు లేదా మూడు అంతస్తుల నిర్మాణాలు చేపట్టాలి. అలా కాకుండా నిర్మాణదారులు ఏకంగా ఆరు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. సెట్‌బ్యాక్ కూడా వదలకుండా రోడ్డుపైకి బాల్కానీ పెడుతూ నిర్మాణాలు చేపడుతున్నారు.

బంజారాహిల్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రయోజనాలను దృష్టిలోపెట్టుకొని, భవిష్యత్తు తరాలకు ఇబ్బంది కలగవద్దనే ఉద్దేశంతో చెరువులు, కుంటల్లో వెలిసిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తుంటే.. అదే ఉత్సాహంలో అక్రమ నిర్మాణాల పని పట్టాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు జేబులు నింపుకుంటున్నారు. ఇది అక్రమ నిర్మాణం..ర్యలు తీసుకోండి అంటూ ఫిర్యాదులు వెల్లువెత్తినా సరే తమకేం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. నిర్మాణదారులతో ఫిర్యాదు చేస్తున్న వారిపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారు.

సర్కిల్-19 పరిధిలో..

ముఖ్యంగా జీహెచ్ఎంసీ సర్కిల్-19 పరిధిలోని మధురానగర్, వెంగళరావునగర్, సిద్ధార్థనగర్, రెహ్మత్‌నగర్, బోరబండలో అక్రమ నిర్మాణాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. చిన్నపాటి స్థలంలో ఆరు అంతస్తులు, నివాసిత ప్రాంతాల్లో కమర్షియల్ భవనాలు వెలుస్తున్నాయి. తద్వారా మౌలిక వసతులు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారు. సెట్‌బ్యాక్‌లు లేకుండా నిర్మాణాలు జరుగుతుండడంతో పక్కనే ఉంటున్న వారికి కనీసం గాలి వెలుతురు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఈ విషయం తెలిసినప్పటికీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అందినంత దోచుకుంటూ అక్రమ నిర్మాణాలకు ఊతమిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాల వెనక వీధిలో..

వెంగళరావునగర్ ప్రభుత్వ పాఠశాల వెనక వీధిలో ఓ వ్యక్తి జీ ప్లస్ మూడు అంతస్తుల నిర్మాణానికి అనుమతి తీసుకున్నారు. ఇది పక్కా నివాసిత ప్రాంతం. 30 అడుగుల రోడ్డు ఉండడంతో సెట్ బ్యాక్ తప్పనిసరిగా అనుసరించాలి. సదరు నిర్మాణదారుడు సెట్‌బ్యాక్ పాటించలేదు. ఇంతటితో ఆగకుండా జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారిని ప్రసన్నం చేసుకొని నాలుగో అంతస్తు వేశాడు. ఇందులో హాస్టల్ లేదా హోటల్ ఏర్పాటు చేయాలని నిర్మాణదారుడి భావన. ఇదే జరిగితే తాము నివాసం ఉండడం ఇబ్బందికరంగా మారుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో కాలనీ వాసులు హైకోర్టును ఆశ్రయించారు. స్పందించిన కోర్టు ఈ ఏడాది జనవరిలో నిర్మాణాలను వెంటనే నిలిపేయడంతో పాటు అక్రమంగా నిర్మించిన వాటిని కూల్చివేయాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించింది. టౌన్‌ప్లానింగ్ అధికారులు 48ఎ కింద నోటీసు కూడా జారీ చేశారు. ఆ తర్వాత రెండు నెలలపాటు మౌనంగా ఉన్న నిర్మాణదారుడు ఇప్పుడు అదనపు అంతస్తు పనులను వేగం చేశాడు. స్థానికులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. ఓ అధికారి ప్రోద్బలంతో సదరు అక్రమ నిర్మాణదారుడు హైకోర్టుకు వెళ్లిన వారిపై తప్పుడు కేసులు పెట్టారు. నిర్మాణదారుడు ఏకంగా మరో అంతస్తు నిర్మించేందుకు పిల్లర్లు వేశాడు. హైకోర్టు ఆదేశాలను సైతం పట్టించుకోకపోతే తాము ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే కాలనీలో మరో నిర్మాణదారుడు కేవలం 300 గజాల స్థలంలో ఆరు అంతస్తుల నిర్మాణం చేపట్టాడు. ఇదేమని ఎవరైనా ప్రశ్నిస్తే తన వెనక రాజకీయ నాయకులు ఉన్నారంటూ బెదిరిస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

అద్దెలు భారీగా వస్తుండడంతో..

కాలనీలతోపాటు బస్తీల్లో ఇంటి అద్దెలకు డిమాండ్ ఉంది. ప్రైవేట్ హాస్టళ్లకు డిమాండ్ ఉండడంతో స్థల యజమానులు అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు. అద్దె ఎక్కువగా వస్తుందని ఇతరులకు ఇబ్బంది కలిగేలా నిర్మాణాలు చేపడుతున్నారు. మధురానగర్‌లో ఇదేవిధంగా ఓ వ్యక్తి నివాసిత వీధిలో ఆరు అంతస్తుల నిర్మాణం చేపట్టి హాస్టల్‌కు అద్దెకిచ్చాడు. సంజీవరెడ్డినగర్ ప్రధాన రహదారికి దగ్గరగా ఉన్న వెంగళరావునగర్, శ్రీనివాసకాలనీ వీధుల్లో మొత్తం భవనాలన్నీ హాస్టళ్లకు అద్దెకు ఇవ్వడంతో ఇక్కడ నివసిస్తున్న వారు ఇళ్లనుఖాళీ చేసి మరో ప్రాంతానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రెహ్మత్‌నగర్, జవహర్‌నగర్‌లో కేవలం అరవై గజాల స్థలంలో కొందరు ఆరు అంతస్తుల భవనాలను నిర్మించారు. వీటిపై జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదులు అందినా వారు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.